# కన్నుల పండువగా సీతారాముల కళ్యాణం





సీతారాముల కళ్యాణం నిర్వహిస్తున్న దృశ్యం, హాజరైన భక్తులు

**తాడిపత్రిఅర్బన్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త**

పట్టణంలోని ఏటిగడ్డపాలెం వ్యాసరాయ ప్రతిష్ఠిత ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం సీతారాముల కళ్యాణం కన్నులపండువగా నిర్వహించారు. శ్రీరామనవమి మహోత్సవాల్లో భాగంగా స్వామివారి కళ్యాణాన్ని నిర్వహించారు. సీతా సమేత శ్రీరామచంద్రుని ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలు, స్వర్ణాభరణాలతో సుందరంగా అలంకరించారు. ఆలయ అర్చకులు మంత్రోచ్చారణల నడుమ సాంప్రదాయబద్ధంగా సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై సీతారాముల కళ్యాణోత్సవాన్ని వీక్షించి భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. కళ్యాణానంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ప్రసాదం పంపిణీ చేశారు. సాయంత్రం సీతారామలక్ష్మణుల ఉత్సవ విగ్రహాలను పట్టణ వీధుల్లో ఘనంగా ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో రోషన్న, రామకృష్ణ, శ్రీనివాసనాయుడు, నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.

## మే 15 మహా పాదయాత్ర ని జయప్రదం చేయండి.జేఏసీ నాయకులు పిలుపు

కరపత్రాలను పంపిణీ చేస్తున్న జేఏసీ నాయకులు



**కనగానపల్లి ఏప్రిల్ 4 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల నందు శనివారం సమగ్ర శిక్ష జేఏసీ నాయకులు మే 15 తేదీన జరిగే మహా పాదయాత్రను జయప్రదం చేయాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు అనంతరం కాంట్రాక్ట్ , ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు వారు పనిచేస్తున్న కార్యాలయం వద్దకు వెళ్లి వారికి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ గత 21సంవత్సరాల నుండి రాష్ట్రంలోని అన్ని మండలాల్లోని అన్ని మండల విద్యాశాఖ కార్యాలయం , ఉన్నత పాఠశాలలు, భవిత కేంద్రాలు, కేజీబీవీ పాఠశాలలు అలాగే జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయం నందు ఇలా 18విభాగాల ఉద్యోగులు అయిన డేటా ఎంట్రీ ఆపరేటర్లు,ఎం ఐ ఎస్ కోఆర్డినేటర్లు, మండల్ లెవెల్ అకౌంటెంట్లు, మెసెంజర్లు, క్లస్టర్ రిజర్వు మొబైల్ టీచర్ లు, ఐ ఈ ఆర్ పిలు, ఫిజియోథెరపిస్ట్ లు, ఆయాలు, పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్స్ కేజీబీవీ పాఠశాలల్లో ప్రిన్సిపాల్స్ , సి ఆర్ టి లు , పీజీటీ లు టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది తదితరులు చాలీచాలని జీతాలతో కాంట్రాక్టు మరియు అవుట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్నామని గత వైసిపి ప్రభుత్వం లో 22 రోజులు మా సమస్యలపై సమ్మె చేస్తే ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తాము అధికారంలోకి వస్తే మీ డిమాండ్ తప్పకుండా నెరవేస్తామని చెప్పి రెండు సంవత్సరాలు పూర్తి అవుతు న్న ఒక్క రూపాయి కూడా తమకు జీతం పెంచలేదని ఇందుకు నిరసనగా ఉద్యోగులు మరియు వారి కుటుంబ సభ్యులతో కలిసి మా బాధలు చెప్పుకోవడానికి మే 15వ తేదీన మంత్రి నారా లోకేష్ ఇంటికి పాదయాత్రగా వెళ్తున్నామని ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని మహా పాదయాత్రను జయప్రదం చేయాలని జేఏసీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్షులు ఓబిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రామన్న, జేఏసీ జిల్లా నాయకులు ఓబులేసు, ముకుంద, రాజా రమేష్, బుల్లే రాజేష్ బాబు ,నారాయణ స్వామి, రామనాగేష్ లు తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎస్ఐ ను మర్యాదపూర్వకంగా కలిసిన తెదేపా నాయకులు



ఎస్ఐ ను సన్మానిస్తున్న దృశ్యం

**గుడిబండ ఏప్రిల్ 4 ప్రభాతవార్త**

మండలానికి నూతన ఎస్ఐగా నియమితులై బాధ్యతలు స్వీకరించిన రమేష్ బాబును తెలుగు దేశం పార్టీ నాయ కులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలి పారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్ మూర్తి,జిల్లా లింగాయత్ అధ్యక్షుడు దుర్గేష్, ఎంపిటిసి వనజా శశిధర్,తిమ్మళాపురం భీమరాజు, క్లస్టర్ ఇంచార్జ్ చిత్రశేఖర్,టిఎన్ఎస్ఎఫ్ జవనదుకురంగ,వెంకటరమణ, మాస్ పాల్గొన్నారు.

## సర్వసభ్య సమావేశానికి హాజరు కాని అధికారులకు నోటీసులు

**నంబులపూలకుంట, ఏప్రిల్ 4 ప్రభాతవార్త**

నిర్లక్ష్యంగా సర్వసభ్య సమావేశానికి హాజరు కాని అధికారులకు నోటీసులు జారీ చేస్తున్నట్లు ఎంపిడిఓ పార్థసారధి తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ రాము అధ్యక్షత వహించారు. అధికారులు శాఖల వారీగా అభివృద్ధి, ఇతర సమస్యలను తెలియజేయాలని కోరారు. ఈ సందర్భంగా అధికారులు అధిక సంఖ్యలో గైర్హాజరు కావడంతో ఎంపిడిఓ పార్థసారధి ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరికి నోటీసులు జారీ చేయాలని ఎంపిపికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలో ఎండలు తీవ్రతను బట్టి ప్రజలకుతాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు.

## జాతీయ సమైక్యతను కాపాడాల్సిన బాధ్యత అన్ని మతాలపై ఉంది

### రన్ ఫర్ జీసస్‌లో బిసివి అధ్యక్షులు హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ



రన్ ఫర్ జీసస్ ర్యాలీ దృశ్యం

**పెనుకొండ ఏప్రిల్ 4 ప్రభాతవార్త**

జాతీయ సమైక్యతను కాపాడవలసిన బాధ్యత అన్ని మతాలలోని ప్రతి వ్యక్తిపై ఉందని బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు శివరామకృష్ణ తెలిపారు. శనివారం ఉదయం పెనుకొండ చర్చి పాస్టర్స్ చర్చి పెద్దల ఆధ్వర్యంలో పాస్టర్స్ ఫెలోషిప్ వారి సహకారంతో బైబిల్ మిషన్ చర్చ్ పాస్టర్ రేవ సుధాకర్ క్రైస్తవ, హిందూ, ముస్లిం మతస్థులతో కలిసి జాతీయ సమైక్యత కోసం రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ రన్ ఫర్ జీసస్ ర్యాలీ మడకశిర సర్కిల్లోని ఎన్టీఆర్ కూడలి వద్దనుండి ప్రారంభమై పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ దర్గాసర్కిల్, కృష్ణదేవరాయ సర్కిల్, గాంధీ సర్కిల్, తెలుగు తల్లి సర్కిల్ మీదుగా పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సర్కిల్ లో శివరామకృష్ణ మాట్లాడుతూ నేటి పరిస్థితుల్లో ప్రపంచంలో అశాంతి నెలకొని ఉందని, అనేక దేశాలలో యుద్ధాలు జరుగుతున్నాయని వాటిని నివారించాల్సిన బాధ్యత ఆ ఆదేశాల ప్రజాప్రతినిధులు,పౌరులపై ఉందన్నారు. భారతదేశం లౌకిక దేశమని, ఈదేశం అనేక మతాల సమ్మేళనమని, భారతదేశం శాంతికి నిలయమని ఇలాంటి సందర్భంలో ఏసుక్రీస్తు చూపిన శాంతి, సహనం,దయా, కరుణ, క్షమాగుణంతో ప్రజల జీవించినప్పుడు జాతీయ సమైక్యత సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసివి అధ్యక్షులు శివరామకృష్ణ ,పాస్టర్ రేవ సుధాకర్, బీచిగానిపల్లి రామాంజప్ప, క్రిస్టఫర్, ఆంధ్రూస్, తదితరులు పాల్గొన్నారు.

## అద్భుత ప్రతిభచాటిన క్రీసెంట్ స్కూల్ విద్యార్థులు





ప్రతిభ కనపరిచిన విద్యార్థులతో క్రిసెంట్ స్కూల్ యజమాన్యం దృశ్యాలు

**అనంతపురం, ఏప్రిల్ 4, (ప్రభాతవార్త )**

నేషనల్ యూనిఫైడ్ కౌన్సిల్ నిర్వహించిన ప్రతిష్టాత్మక పోటీలలో క్రిసెంట్ స్కూలు విద్యార్థులు పాల్గొని, అద్భుతమైన ప్రతిభ కనపరిచారు. క్రిసెంట్ స్కూల్ యజమాన్యం ప్రతిభ చాటిన విద్యార్థులు 26 మందికి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహిస్తూ, వారికి మెడల్స్ మరియు సర్టిఫికేట్లను అందజేసిన క్రిసెంట్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ శ్రీమతి షమీం సఫిఉల్లా కు, కరెస్పాండెంట్ శ్రీ కె.యం. షకీల్ షఫీ కు ఆ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలియజేశారు.గత 38 సంవత్సరాలుగా 100 శీశీది పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన క్రిసెంట్ హై స్కూల్, అనంతపురం అందరి మన్ననలను పొందుతోంది.

# వైద్యం అందక గర్భిణీ మృతి

**కదిరి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త**

సకాలంలో వైద్యం అందక గర్భిణీ స్త్రీ మృతి చెందిన సంఘటన శనివారం కదిరిలో చోటు చేసుకుంది. భర్త రమేష్, బంధువులు తెలిపిన వివరాల మేరకు ఈ నెల 1వ తేదిన వాణి స్థానిక పట్టణంలోని ప్రైవేట్ వైద్యశాలలో ప్రసవానికి చేరింది. వైద్యులు వాణికి గత రెండు రోజుల నుంచి చికిత్స అందిస్తున్నారు. చికిత్స కొనసాగుతున్న సమయంలో ఆమె ఆరోగ్యం విషమించిందని వెంటనే మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని, వెంటనే బెంగుళూరుకు తీసుకెళ్లాలని వైద్యులు రెఫర్ చేశారు. వాణిని మెరుగైన చికిత్సల నిమిత్తం తరలిస్తుండగా మార్గ మద్యంలో మృతి చెందింది. వాణి ఆరోగ్యం విషమించినప్పటికీ సరైన చికిత్స అందించడంలో వైద్యులు నిర్లక్ష్యం వహించడంతో వాణి మృతి చెందిందని భర్త, బంధువులు ఆరోపించారు. వాణి మృతికి కారకులైన ప్రైవేట్ వైద్యశాల, వైద్యులపై చర్యలు తీసుకోవాలని వైద్య శాల ముందు బంధువులు సుమారు 4 గంటలపాటు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. విషయం తెలుసుకున్న పట్టణ సిఐ సంఘటనా స్థలానికి చేరుకుని పూర్తి స్థాయిలో విచారించి తగు చర్యలు తీసుకుంటామని భరోసా ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

**మా వైద్యశాలపై నిరాధారమైన ఆరోపణలు చేయడం తగదు : సాయినాథ్ వైద్య శాల యాజమాన్యం**

సకాలంలో వైద్యం అందక గర్భిణీ మృతి చెందిందని తప్పుడు ఆరోపణలు చేయడం సరైంది కాదని సాయినాథ్ ఆసుపత్రి యాజమాన్యం శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఇందుకు సంబంధించిన వివరాల మేరకు.. ఈనెల 1న వాణిశ్రీ అనే గర్భిణీ స్త్రీ రెండవ కాన్పుకై తమ వైద్య శాలలో చేరడం జరిగిందని, సాధారణ కాన్పు కష్టమైన పరిస్థితుల్లో అత్యవసరంగా సిజేరియన్ (ఆపరేషన్) చేయడం జరిగిందన్నారు. అయితే సిజేరియన్ అయిన గంట అనంతరం వాణిశ్రీకి అమోనెటిక్ ఫ్లూయిడ్ ఎంబలిసం అనే ప్రాణాంతకమైన సమస్య రావడంతో వైద్య పరంగా అన్ని చికిత్సలు అందించి మెరుగైన చికిత్సల కొరకు బెంగుళూరుకు రెఫర్ చేయడం జరిగిందన్నారు. దురదృష్ట వశాత్తు మార్గ మద్యంలోనే వాణిశ్రీ మృతి చెందడం జరిగిందని, ఆ సమయంలో వైద్య పరంగా అత్యున్నత ప్రమాణాలతో చికత్స అందించామన్నారు. అయితే శుక్రవారం వాణిశ్రీ కుటుంబ సభ్యులు కొంత మంది వైద్యశాలకు వచ్చి మహిళా డాక్టర్ని పోలీసుల ఎదుటే దుర్భాషలాడారని, ఆ సమయంలో ఆసుపత్రి యాజమాన్యం మూడు రోజుల పాటు అత్యవసర పని నిమిత్తం బయటికి వెళ్లడం జరిగిందని అయితే వాణిశ్రీ బంధువులు కొంత మంది ఆగ్రహించి వైద్యశాలలోకి దౌర్జన్యంగా ప్రవేశించి వస్తువులను ధ్వంసం చేయడంతోపాటు సిబ్బందిపై దాడులకు ప్రయత్నించడం, వైద్యశాలలో చికిత్స పొందుతున్న రోగులను భయభ్రాంతులకు గురి చేశారన్నారు. తమ వైద్య శాల స్థాపించి 20 సంవత్సరాలు పైబడి 15వేలకుపైగా కాన్పులు అత్యున్నత ప్రమాణాలతో చేస్తూ మెరుగైన చికిత్సలు అందిస్తున్నామని, నిరాధార ఆరోపణలు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సాయినాథ్ వైద్యశాల యాజమాన్యం తెలిపారు.



వాణి ఫైల్‌ఫోటో

## రైస్ మిల్లును ప్రారంభించిన మాజీ మంత్రి పల్లె



రిబ్బన్ కట్ చేసి రైస్ మిల్లును ప్రారంభిస్తున్న మాజీ మంత్రి పల్లె

**ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 4, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని జడ్పీటిసి మాజీ సభ్యుడు పిట్టా ఓబుళరెడ్డి సోదరుడు, మండల స్టోర్ డీలర్ల సంఘం అధ్యక్షుడు పిట్టా రాజారెడ్డికి చెందిన రైస్ మిల్లును శనివారం మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ప్రారంభించారు. రైస్ మిల్లులో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మాజీ మంత్రి పల్లె పాల్గొన్నారు. రిబ్బన్ కటింగ్ చేసి పలు విభాగాలను ప్రారంభించారు. రైతులకు నాణ్యమైన బియ్యం అందేలా, సౌకర్యవంతంగా ఉండేలా చూడాలని సూచించారు. అంతకు ముందు చెత్త సేకరణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్వచ్ఛ రథాన్ని పల్లె ప్రారంభించారు. పల్లె వెంట కన్వీనరర్ జయచంద్ర, సింగిల్ విండో అధ్యక్షులు మహబూబ్ బాష, శివారెడ్డి, పిట్టా ప్రభాకర్‌రెడ్డి, పిట్టా శివశంకర్‌రెడ్డి, బూదిలి ఓబుళరెడ్డి, సాదీ నాగరాజు, మండోజి ఆరిఫ్‌ఖాన్, బుద్ధల గోపినాథ్‌రెడ్డి, జీవి ఆదినారాయణ పాల్గొన్నారు.

## ఇన్‌చార్జ్ తహశీల్దార్‌గా మారుతిప్రకాష్ బాధ్యతలు



ఇన్‌చార్జ్ తహశీల్దార్ మారుతిప్రకాష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**అమడగూరు, ఏప్రిల్ 4 ప్రభాతవార్త**

అమడగూరు మండల ఇన్‌చార్జ్ తహశీల్దార్‌గా మారుతిప్రకాష్ శనివారం బాధ్యతలు చేపట్టారు. అమదుగూరు తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న రామనాథరెడ్డి అనారోగ్యం కారణంగా సెలవు పెట్టడంతో ఆయన స్థానంలో మారుతీప్రకాష్ బాధ్యతలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. బాధ్యతలు చేపట్టిన ఇన్‌చార్జ్ తహశీల్దార్‌కు స్థానిక మండల కన్వీనర్ గోపాల్‌రెడ్డి, ఆర్ఐ రామకృష్ణారెడ్డి, మండల ఎన్ఆర్‌జిఎస్ సిబ్బంది స్వాగతం పలికి సన్మానించారు.

## వివాహ వేడుకలకు హాజరైన రమేష్‌రెడ్డి



వధూవరులను ఆశీర్వదిస్తున్న రమేష్‌రెడ్డి

**తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త**

పెద్దపప్పూరు మండలం అశ్వత్థం, తాడిపత్రి మండలం ఊరుచింతలలో శనివారం జరిగిన వివాహ వేడుకలకు వైసిపి రాష్ట్ర కార్యదర్శి కొనుదుల రమేష్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియచేశారు. ఆయన వెంట పలువురు వైకాపా నాయకులు, కార్యకర్తలు వున్నారు.

## వడదెబ్బపై అవగాహన సదస్సు

**పెద్దవడుగూరు, ఏప్రిల్ 4 ప్రభాతవార్త**



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెద్దవడుగూరు మండలం కిష్టిపాడు, కొండుపల్లి గ్రామాల్లో శనివారం డాక్టర్ శ్రీనివాసబాబు ఆధ్వర్యంలో వడదెబ్బపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ వడదెబ్బ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియ చేశారు. ఓఆర్ఎస్ ద్రావణం ఎలా వాడాలి ఎప్పుడు వాడాలన్న దానిపై వివరించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అన్ని ప్రభుత్వాసుపత్రులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడి సిబ్బంది వద్ద ఉచితంగా లభిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ రోజు 5 లీటర్ల నీటిని సేవించాలని ఆయన గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ ఎస్.రాము, సూపర్‌వైజర్ ఓబుళమ్మ, ఏఎన్ఎం రామలక్ష్మి, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడి సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రైతులకు పట్టాదారు పుస్తకాలు పంపిణీ



పట్టాదారు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

**యల్లనూరు, ఏప్రిల్ 4 ప్రభాతవార్త**

యల్లనూరు మండలం మేడకుర్తి గ్రామంలో శనివారం రైతులకు పట్టాదారు పుస్తకాలు పంపిణీ చేశారు. శింగనమల నియోజకవర్గం మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో విఆర్ఓ దిలీప్‌కుమార్‌రెడ్డి, సర్వేయర్ బాబాలు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో అధికారులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## రన్ ఫర్ జీసస్‌లో ఉత్సాహంగా పాల్గొన్న క్రైస్తవులు



రన్ ఫర్ జీసస్‌లో పాల్గొన్న క్రైస్తవులు

**తాడిపత్రిఅర్బన్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త**

తాడిపత్రిలోని అన్ని చర్చిల ఫాదర్లు, క్రైస్తవులు కలిసి శనివారం పట్టణంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొదట సుంకులమ్మపాలెం సర్కిల్ నుంచి ప్రారంభమై నంద్యాలరోడ్డు, సిబి రోడ్డు మీదుగా నందలపాడు చర్చి వరకు భారీగా క్రైస్తవులందరూ కలిసి ర్యాలీ చేపట్టారు. క్రైస్తవుల ఐక్యత కోసం ఈ ర్యాలీ చేపట్టినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

## దేవస్థానంకు 43-రిజిస్టర్ నమోదుపై 16న గ్రామసభ

**పుట్లూరు, ఏప్రిల్ 4 ప్రభాతవార్త**

పుట్లూరు మండలం కడవకల్లు గ్రామంలో వెలసిన చెన్నకేశవస్వామి దేవస్థానానికి 43-రిజిస్టర్ నమోదు చేయుటకు ఈనెల 16న కడవకల్లు గ్రామంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించనున్నట్లు దేవాదాయశాఖ ఈఓ శోభ తెలిపారు. ఈ విషయమై అభ్యర్ధనలు ఉంటే గ్రామస్తులు గ్రామసభలో తెలియజేయాలని ఈఓ కోరారు.

## విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి పెంపు

- జెడ్పీ హైస్కూల్‌లో కల్చరల్ స్పోర్ట్స్ వీక్



విద్యార్థుల తో యోగ నిర్వహించిన ఎంఈఓ తిరుపాల్ నాయక్

**నల్లచెరువు, ఏప్రిల్ 4 ప్రభాతవార్త**



విద్యార్థులు తయారుచేసిన మోడల్ రంగుల కిట్

రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు సమగ్ర శిక్ష ప్రాజెక్టు ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులు వాదల పల్లి షఫీ ఆధ్వర్యంలో శనివారం కల్చరల్ అండ్ స్పోర్ట్స్ వీక్ ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ 1 తిరుపాల్ నాయక్,ఎంఈఓ2 చెన్నకేశవులు హాజరై విద్యార్థులను ప్రోత్సహించారు.ఈ సందర్భంగా విద్యార్థుల నైపుణ్యాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా క్వాలిటీ ఇన్సియేటివ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు నాలుగు విభాగాలలో విభిన్న క్రీడా, సాంస్కృతిక కార్యకలాపాలలో పాల్గొన్నారు. ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్స్‌లో 100 మీటర్లు, 200 మీటర్ల పరుగు పందాలు, షాట్‌పుట్, డిస్కస్ త్రో, లాంగ్ జంప్, హై జంప్ పోటీలు నిర్వహించారు. టీమ్ స్పోర్ట్స్‌లో వాలీబాల్, క్రికెట్,కబడ్డీ,కోకో ఆటలు ఆకట్టుకున్నాయి. ఇండోర్ స్పోర్ట్స్‌లో బ్యాడ్మింటన్, చెస్ పోటీలు నిర్వహించగా, ఫిట్‌నెస్ వర్క్‌షాప్‌లో యోగా,ధ్యానం కార్యక్రమాలు చేపట్టారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి, ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడమే ముఖ్య ఉద్దేశమని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు వి.షఫీ,షబ్బీర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రెడ్డమ్మ, సృజన, రాజగోపాల్, శ్రీరాములు, అశోక్ కుమార్ రెడ్డి,మధుబాబు,హరినాథ్ రెడ్డి పాల్గొన్నారు.

## బ్రిలియంట్ పబ్లిక్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ యానివర్స్ డే కార్యక్రమం



డాన్స్‌లో పాల్గొన్న చిన్నారులు.విద్యార్థులు

**నల్లచెరువు ఏప్రిల్ 4 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని కేపూల కుంట రోడ్డు సమీపంలో బ్రిలియంట్ పబ్లిక్ స్కూల్ యానివర్స్ డే కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, కరస్పాండెంట్ కార్తీక్, ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులు పలువురు అధికారులు నాయకులు తొలిత జ్యోతి ప్రభల తో మొదలుపెట్టి సరస్వతి దేవికి వందనం పలికారు అనంతరం చిన్నారుల చేత చిలిపి చిలిపి పాటలతో విద్యార్థుల తల్లిదండ్రుల కనీ విందుగా చూసి సంతోషాలు వ్యక్తం చేశారు బ్రిలియంట్ స్కూల్ విద్యతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందించి నిర్వహించిన కరస్పాండెంట్ కార్తీక్, శ్రీనివాసులకు అభినందన తెలిపారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ కార్తీక్ మాట్లాడుతూ. పతి విద్యార్థిని చైతన్యవంతులు చేయడమే బ్రిలియంట్ స్కూల్ ధ్యేయమని విద్యార్థులకు విద్యతోపాటు వారి టాలెంట్ ను గుర్తించడమే సాంస్కృతిక కార్యక్రమాలు వ్యాసరచన పోటీలు విద్యార్థులకు నవోదయ, ఎన్.ఎం. ఎం ఎస్, గురుకుల, విద్యా పోటీలకు కోచింగ్ ఇస్తూ విద్యార్థులకు సత్తా చాటి న బ్రిలియన్స్ స్కూల్ ఒక మైలురాయిగా ముందుకు తీసుకెళ్తున్న మనీ తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## చౌడేశ్వరిదేవి ఆలయంలో ఘనంగా మహాచండీ యాగం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

**అమడగూరు, ఏప్రిల్ 4 ప్రభాతవార్త**

అమదుగూరు మండల కేంద్రంలో వెలసిన చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాల్లో భాగంగా శనివారం మహాచండీ యాగం ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా 108 కలశాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కుంభాభిషేకము, హోమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త పొట్టా పురుషోత్తంరెడ్డి తెలిపారు. ధర్మకర్త సోదరుడు మల్లికార్జునరెడ్డి, జయదేవ్‌రెడ్డి కుటుంబ సభ్యులు అమ్మవారి ఆలయంలో వేదపండితులు జ్ఞానేశ్వర్మ, సంతోష్‌శర్మ, గోకుల్‌భట్టుశర్మ, శ్రీధర్‌శర్మ, సుధీర్‌శర్మలు హోమాలు నిర్వహిస్తున్నారు. హాజరైన భక్తులకు భోజనవసతి కల్పించారు. ఆదివారం చౌడేశ్వరి జ్యోతి ఉత్సవాల సందర్భంగా తేరు ఆమదగూరు పురవీధుల గుండా ఊరేగుతుందని, అలాగే కుంభాభిషేకం హోమం కూడా నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కావున ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుండి పెద్దఎత్తున భక్తులు అమ్మవారి తేరు, జ్యోతి ఉత్సవాలకు హాజరుకావాలని ఆలయ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి పొట్టా ఉమా దేవి, పూజిత, కె.మురళిస్వామి, కె.కాంతిస్వామి, కన్నడ హీరో వెంకటేష్ ప్రసాద్, శ్యామురావు, డాక్టర్ సమరం, పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## ఓబులేసుకోనలో స్వాతినక్షత్రం పూజలు

**తాడిపత్రిఅర్బన్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త**



లక్ష్మీనరసింహస్వామిని అలంకరించిన దృశ్యం

తాడిపత్రి మండలం ఓబులేసుకోనలో శనివారం స్వాతినక్షత్రం పూజలను ఘనంగా నిర్వహించారు. స్వామివారి జన్మనక్ష త్రం స్వాతినక్ష త్రాన్ని పురస్కరించుకుని ఉదయం అర్చకులు యోగానందశర్మ శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామికి సుప్రభాతసేవ, అభిషేకాలు, నవకలశ స్నపన, తిరుమంజన సేవ, తోమాలసేవ, సహస్రనామార్చాన సేవ, మహా నివేదన శాత్తుమొరై, మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగము, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి ప్రాకారోత్సవం, తదితర పూజా కార్య క్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. స్వాతి నక్షత్రం రోజు స్వామి వారిని దర్శించుకుంటే తాము కోరిన కోరికలు నెరవేరుస్తారని భక్తుల నమ్మకం. అనంతరం హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

06ATP27_06ATP27.qxd 04-04-2026 PM 10:38 Page 1



## రామగిరిలో బీజెపి ప్రశిక్షణ తరగతులు

**రామగిరి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త**

మండల కేంద్రమైన రామగిరిలోని షిర్డిసాయి బాబా ఆలయంలో భారతీయ జనతా పార్టీ పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. మండల బిజెపి అధ్యక్షులు చిట్ర శివయ్య అధ్యక్షతన జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి, ప్రశిక్షణ జిల్లా కన్వీనర్ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. బీజేపి కొన్ని లక్షల మంది త్యాగాలతో ఈ రోజు మనం అధికారంలో ఉన్నామన్నారు. 1951 జనసంఘ్ పార్టీ నుంచి అనేక మంది కార్యకర్తల కృషి బిజెపి బలోపేతానికి కారణమన్నారు. మండలంలో కూటమి ప్రభుత్వం అన్ని విదాలు చేస్తోందన్నారు. బిజెపి మండలంలో అన్ని బూత్ కమిటీలు వేయాలని ప్రజాసేవే మొదటి లక్ష్యంగా నాయకులు నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఈశ్వర్ ప్రసాద్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు దామోదర్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనాథ్, కోడి రామ్మూర్తి, బీమశేఖర్, అశోక్, సంజీవరెడ్డి, రామలింగ పాల్గొన్నారు.

## ఎంబీఏ కళాశాలలో ఈనెల 6 నుంచి ఐడి ఈ బూట్ క్యాంప్

**పుట్టపర్తి టౌన్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త**



సమావేశంలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపల్

పుట్టపర్తి లోని బీడిపల్లి వద్ద గల సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 6 నుంచి ఐడిఈ బూట్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ హేమచంద్ర పేర్కొన్నారు. శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విద్యార్థులలో ఆవిష్కరణ, డిజైన్, పారిశ్రామిక నైపుణ్యాలను పెంపొందించేందుకు ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో "ఇన్నోవేషన్ డిజైన్ అండ్ ఎంట్రప్రెన్యూర్షిప్ (ఐడిఈ) బూట్ క్యాప్2026 ప్రారంభమవుతుందని, ఆరవ తేదీ నుంచి నాలుగు రోజులు పాటు జరిగే కార్యక్రమానికి దేశంలోని 10 రాష్ట్రాల నుంచి 259 మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు. విద్యార్థులలో ఆవిష్కరణ దృక్పథం, డిజైన్ థింకింగ్ మరియు వ్యాపార దృష్టిని పెంపొందించడానికి అనేక ప్రాక్టికల్ సెషన్స్, మెంటరింగ్ కార్యక్రమాలు, నిపుణుల ఉపన్యాసాలు నిర్వహించబడతాయన్నారు. విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి, ఆలోచనలు రేకెత్తించడానికి 12 మంది ప్రత్యేక నిపుణులతో విద్యార్థులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. "డిజైన్ అభివృద్ధికి ప్రధాన మార్గదర్శి"అనే థీమ్ తో ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహించడానికి రెండు కళాశాలలు ఎంపిక అయితే అందులో సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాల ఒకటని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అందరూ కృషి చేయాలని సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రిన్సిపల్ కోరారు.

## అనుమానస్పద పరికరాలను, వస్తువులను కొనుగోలు చేయొద్దు

### ఎస్సై సుధాకర్ యాదవ్

**సోమందేపల్లి మార్చి 4 ప్రభాతవార్త**



గుజిరి వ్యాపారస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సుధాకర్ యాదవ్

మండల వ్యాప్తంగా ఉన్న గుజిరి (సెకండ్ హ్యాండ్ / స్క్రాప్) షాపుల యజమానులతో స్థానిక పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ఎస్సై సుధాకర్ యాదవ్ అవగాహన సమావేశంఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గుజిరి కొనుగోలు షాపుల యజమానులతో ఎస్సై మాట్లాడుతూ ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు దొంగ వస్తువులు గాని, ముఖ్యంగా రైతులకు సంబంధించిన వ్యవసాయ పరికరాలు, మోటార్లు, కేబుల్స్ తదితర వస్తువులు అమ్మడానికి తీసుకువచ్చినచో వాటిని కొనుగోలు చేయకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలియజేశారు. అలాగే ఎవరైనా దొంగ వస్తువుల ను కొనుగోలు చేస్తున్నట్లు లేదా నిల్వ ఉంచుతున్నట్లు పోలీసులకు సమాచారం అందినచో, సంబంధిత వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఇతర మండలాలు, జిల్లాలు లేదా రాష్ట్రాల నుండి వచ్చిన పోలీసులు మీ షాపుల్లో దొంగ వస్తువులను రికవరీ చేసినట్లు గమనించినచో, సంబంధిత షాపుల యజమానులపై కూడా కఠినంగా చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. షాపుల యజమానులు పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరిస్తామని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు గమనించిన వెంటనే సమాచారం అందిస్తామని తెలిపారు. ప్రజల ఆస్తి రక్షణకు , నేరాల నివారణకు ప్రతి ఒక్కరూ పోలీసులతో సహకరించాలని విజ్ఞప్తి చేయడమైనది ఈ సందర్భంగా గుజిరి వ్యాపార షాపుల యజమానులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో విద్యుత్ లైన్మెన్ దుర్మరణం

**బత్తలపల్లి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త**



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విద్యుత్తు లైన్మెన్ నాగేశ్వరరెడ్డి

మండల పరిధిలోన గుమ్మలకుంట బస్టాప్ వద్ద నిలిపి ఉన్న వాహనాన్ని ఢీకొని విద్యుత్తు లైన్మెన్ దుర్మరణం చెందాడు. మండలంలోని నెత్తివారంపల్లి గ్రామానికి చెందిన విద్యుత్తు లైన్మెన్ నాగేశ్వరరెడ్డి(40) శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనంలో బత్తలపల్లికి వస్తుండగా జాతీయ రహదారిపై నిలిపి ఉన్న బొలెరో వాహనంను ఢీకొన్న ఘటనలో లైన్మెన్ మృతి చెందాడు. నెత్తివారంపల్లి గ్రామానికి చెందిన నాగేశ్వరరెడ్డి ఓబులాపురం పంచాయతీలో విద్యుత్ లైన్మెన్గా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా రాత్రి రామాపురం నుంచి బత్త లపల్లి సబ్ స్టేషన్కు ద్విచక్ర వాహనంపై వస్తూ గుమ్మల్లకుంట బస్టాఫ్ సమీపంలోకి చేరుకోగానే నిలిపి ఉన్న వాహనంను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న బత్తలపల్లి పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా,నాగేశ్వరరెడ్డికి భార్యతో పాటు ఓ కుమారుడు,కుమార్తె ఉన్నారు.

## గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారుల నియామకం

**వజ్రకరూరు ఏప్రిల్ 4, ప్రభాతవార్త**

సర్పంచుల పదవీకాలం ముగియడంతో పరిపాలన సౌలభ్యం నిమిత్తం మండలంలోని 19 గ్రామ పంచాయతీలకు వివిధ శాఖల మండల అధికారుల ను ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాకలెక్టర్ ప్రత్యేక అధికారులుగా నియమించారు. గ్రామ పంచాయతీల వారీగా వారి వివరాలు తహసిల్దార్ నరేష్ కుమార్ నువజ్రకరూరు, చాబాల, గడే హోతూరు. వ్యవసాయ శాఖ అధికారి మధుకర్‌ను పీ.సీప్యాపిలి, పాతకడమలకుంట. డిప్యూటీ ఎంపీడీవో (జి ఎస్ డబ్ల్యూఎస్)కొనకొండ్ల ,గూళ్యపాలెం,కమలపాడు. పశుసం వర్ధక శాఖ అధికారికృష్ణమూర్తి నాయక్ నువెంకటంపల్లి, వెంకటంపల్లి పెద్ద తండా, జరుట్ల రాంపురం.ఎంఈఓ ఎర్రి స్వామిని చిన్న హోతురు, ధర్మపురి. ఎంఈఓ 2 తిమ్మప్పను రాగులపాడు, పందికుంట. ఏ.వో (ఎంపీడీవో ఆఫీస్) తట్రకల్లు, ఎన్ఎన్. పీతండా. గ్రామాలకు ప్రత్యేకఅధికారులుగా నియమించారు. పదవీ విరమణ పొందిన ఎంపీడీవో శివాజీ రెడ్డిని గంజికుంట ఎంపీడీవోగా పదోన్నతి పై బదిలీ అయిన దామోదర్ రెడ్డిని ఛాయాపురం గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులుగా నియమించారు. ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో స్థానాలలో ఎవరిని నియమిస్తారో సోమవారం ఉత్తర్వులు వెలువడనున్నాయి. వజ్రకరూరు మండలం ఎంపీడీవోగా ఉరవకొండ ఎంపీడీవో రవి ప్రసాద్ ఇన్చార్జ్ ఎంపీడీవోగా కొనసాగునున్నారు.

## లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

**-7న విగ్రహ ప్రతిష్టాపన మండల పూజా కార్యక్రమం**

**ఉరవకొండ, ఏప్రిల్ 4 ప్రభాతవార్త**



పట్టణంలోని డ్రైవర్స్ కాలనీలోగల లక్ష్మి వెంకటేశ్వరస్వామి సహిత పంచముఖ ఆంజినేయస్వామి ఆలయంలో స్వస్తిశ్రీ పరాభవ నామ సంవత్సరం చైత్ర శుద్ధ విదియ శనివారం స్వామివార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు సాయిక్రిష్ణ లక్ష్మి వెంకటేశ్వరస్వామి, పంచాముఖ ఆంజినేయస్వామి మూలవిరాట్‌లకు ఉదయం విశేష అభిషేకం, అలంకరణ, పూజలు, మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. కాగా ఈనెల 7వ తేదీన మంగళవారం ఆలయంలో లక్ష్మివెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట జరిగిన 40 రోజులు పూర్తీ అయిన సందర్భంగా మండల పూజా కార్యక్రమం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి పూజల్లో పాల్గొనాలని పిలుపునిచ్చింది. మధ్యాన్నం 12.30 గంటలకు భక్తులకు అన్నదాన కార్యక్రమంలో కొనసాగుతుందని కమిటీ తెలిపింది.

## ధర్మవరం డిగ్రీ విద్యార్థిని జాతీయ సమైక్యతా శిబిరానికిఎంపిక...!

**ధర్మవరం,ఏప్రిల్ 4,ప్రభాతవార్త**



జాతీయ సమైక్యతా శిబిరానికి ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్రెడ్డి

ధర్మవరం పట్టణంలోని కెహెచ్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో బీకాం ద్వితియసంవత్సరం చదువుతున్న ఎం.రక్షిత జాతీయ సమైక్యతశిబిరానికి ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. కళాశాల విద్యార్థిని రక్షితను శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ,రాష్ట్ర ఎన్ఎస్ఎస్ అదికారులు ఎన్ఐసీక్యాంప్ కు ఎంపిక చేయడం చాలా సంతోషంగా ఉందని ప్రిన్సిపల్ తెలిపారు. ఈ విద్యార్థిని కర్నాటక రాష్ట్రంలోని మాండ్యలోని ఆధిచుంచనగిరి విశ్వవిద్యాలయంలో ఈనెల 5వ తేదీనుంచి 11వ తేదీ వరకు జరిగే జాతీయ సమైక్యతా శిబిరంలో పాల్గొంటారన్నారు.దీంతో శనివారం విద్యార్థిరక్షితను ప్రిన్సిపల్తోపాటు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి గోపాలానాయక్, వైస్ ప్రిన్సిపల్ చిట్టెమ్మ, అధ్యాపకులు కిరణ్కుమార్, త్రివేణి,షమీవుల్లా, పావని, సరస్వతి, ఆనంద్ అభినందించారు.

## టీటీడీ చైర్మన్ నుండి బిఆర్ నాయుడును తొలగించండి

**అమరాపురం ఏప్రిల్ 4 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో వైకాపా నాయకులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించి ఆరోపణలు ఎదుర్కొంటున్న టిటిడి చైర్మన్ బి.ఆర్ నాయుడు ను తక్షణం తొలగించాలని వైకాపా నాయకులు డిమాండ్ చేశారు.ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైనట్లు వారు ఆరోపించారు. టీటీడీ చైర్మన్ బి.ఆర్ నాయుడు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ పూజా కార్యక్రమాన్ని వైసీపీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అమరాపురం లక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసినట్లువైసీపీ నాయకులు పేర్కొన్నారు. తిరుమలను అపవిత్రం చేస్తూ భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న బీఆర్ నాయుడు వెంటనే రాజీనామా చేయాలని అమరాపురంలో వైసీపి శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా మండల పార్టీ అధ్యక్షుడు త్రిలోకనాథ్, ఎంపీపీ కెంకెర ఈరన్న, మాజీ వక్కలిగ స్టేట్ డైరెక్టర్ వీరక్యాతరాయప్ప, మాజీసర్పంచులు పేలుబండ ప్రసాద్ , గిరిజమ్మ సదానంద గౌడ్, వైయస్సార్సీపి నాయకులు జెకె నరసింహమూర్తి, కో ఆప్షన్ సభ్యుడు రసూల్ బాషా ఆటో తిప్పయ్య,విరాపురం సురేష్,అమరాపురం మల్లికార్జున, నాగేంద్రబాబు, రాఘవేంద్ర, చంద్రశేఖర్,నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల న్యాయమైన కోరికల సాధన కోసమే కమిటీలు

**- గోరంట్ల మండల అధ్యక్షునిగా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా రాందాస్‌నాయక్**



ఎంపికైన నూతన కమిటీ

**గోరంట్ల, ఏప్రిల్ 4 ప్రభాతవార్త**

గోరంట్ల పట్టణంలోని మాధవరాయుని ఆలయ ప్రాంగణంలో శనివారం ఏపిటిఎఫ్ 1938 మండల శాఖ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలను సత్యసాయి జిల్లా ఉపాధ్యక్షులు గోపాల్‌రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పూర్వ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, మండల పూర్వ అధ్యక్షులు తిరుపాల్‌నాయక్ పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో మండల గౌరవ అధ్యక్షులుగా అజ్జుగళ్ళ నాగేష్, అధ్యక్షులుగా ఎం.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా వి.రామదాస్‌నాయక్, అసోసియేట్ అధ్యక్షులుగా జి.శ్రీరాములు, ట్రెజరర్‌గా ఎస్.శ్రీరాములునాయక్, ఉపాధ్యక్షులుగా వెంకటాచలపతి, కె.రామచంద్ర, ఎస్.రమేష్‌బాబు, అదనపు కార్యదర్శిగా ఎం.శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా వెంకటరమణనాయక్, మనోహర్‌నాయక్, కే.నాగేంద్ర, కార్యవర్గ సభ్యులుగా ఫణీంద్రకుమార్, గంగాధరప్ప, కిషోర్‌కుమార్, మదనమోహన్, సురేష్, అయ్యప్పనాయక్, రవీంద్ర, శ్రీనివాసమూర్తి, వెంకటరాముడు, అంజినప్ప, నరేష్, హనుమంతు, శ్రీరాములును ఎన్నుకోవడం జరిగింది. ఎన్నికైన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ నూతన కార్యవర్గం రాబోయే రెండు సంవత్సరాలు ఉపాధ్యాయుల సమస్యలపై నిత్యం పోరాడుతూ వాటి పరిష్కారానికి ప్రయత్నం చేయాలని అలాగే ఉపాధ్యాయులకు కలుగుతున్న అసౌకర్యాలు పరిష్కరించడానికి ప్రయత్నం చేస్తూ మండలంలో ఉన్న సమస్యలను జిల్లా కార్యవర్గం దృష్టికి తీసుకువెళ్లి ఆ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని ఈ సందర్భంగా జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి నాగరాజు సూచించారు. ఎన్నికైన నూతన కార్యవర్గం మాట్లాడుతూ తమకు ఇచ్చిన ఈ బాధ్యతను తూచా తప్పకుండా నిర్వర్తిస్తామని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పాటుపడుతామని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. అలాగే తమకు ఈ అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## రైతులకు మైక్రో ఇరిగేషన్ పరికరాలు అందించడంలో రాష్ట్రంలో జిల్లా రెండో స్థానం

### ప్రాజెక్ట్ డైరెక్టర్ సుదర్శన్



ప్రాజెక్ట్ డైరెక్టర్ సుదర్శన్

**శ్రీ సత్య సాయి జిల్లా వైద్యము, ఏప్రిల్ 04, ప్రభాతవార్త:**

శ్రీ సత్య సాయి జిల్లాలో రైతులకు డ్రిప్ మరియు స్ప్రిన్లర్స్ అందజేయడంలో శ్రీ సత్యసాయి జిల్లాలో ఏపీఎంఐపికి రెండవ స్థానం లభించిందని ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్ పేర్కొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ 2025 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం శ్రీ సత్యసాయి జిల్లాకు 14000 హెక్టార్లకు టార్గెట్ నిర్ధారించగా, 14,297 హెక్టార్లు పూర్తి చేసి రాష్ట్రంలో రెండవ స్థానంలో నిలిచిందన్నారు. జిల్లాలోని 32 మండలాలకు సంబంధించి 11,866 మంది రైతులకు 14,297 హెక్టర్లకు డ్రిప్ మరియు స్ప్రిన్క్లర్స్ మంజూరుచేయడం జరిగిందని, ఆటోమేషన్‌పథకానికి సంబంధించి ప్రభుత్వం నిర్ణయించిన టార్గెట్ గాను జిల్లా నుండి ఆరు మంది రైతులకు ఆటోమేషన్ ద్వారా మంజూరు చేయడం జరిగిందన్నారు.2025 26 ఆర్థిక సంవత్సరంకు సంబంధించి ప్రభుత్వంఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేసినందుకు, తద్వారా జిల్లా రైతులకు మేలు జరగడంపై సంతృప్తి వ్యక్తం చేశారు.

## సుబ్రహ్మణ్యం స్వామి ఆలయంలో వైస్సార్సీపీ నాయకులు ప్రత్యేక పూజలు

**పరిగి ఏప్రిల్ 4(ప్రభాత వార్త):**



కార్యక్రమంలో వైసీపీ నాయకులు కార్యకర్తలు

సత్య సాయి జిల్లా పరిగి మండలంలోని పైడేటి సుబ్రమణ్య స్వామి దేవాలయంలో వైస్సార్ సీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు, కార్యక్రమంలో వైసీపీ శ్రేణులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి మంచి బుద్ధి ప్రసాదించాలని స్వామిని వేడుకున్న పార్టీ శ్రేణులు.కోట్లాదిమంది భక్తుల ఆరాధ్య దైవం, కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ పవిత్రతను దెబ్బతీసిన చైర్మన్ బి ఆర్ నాయుడు వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేసిన వైఎస్ఆర్సిపి నాయకులు .లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ని వెంటనే విధులు నుండి తొలగించాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన వైఎస్సార్సీపీ నాయకులు. కార్యక్రమంలో మండల కన్వీనర్, ఎంపీపీ, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, వైఎస్ఆర్సిపి వివిధ అనుబంధ కమిటీల సభ్యులు,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## రైల్వే భద్రతా మౌలిక సదుపాయాలపై దృష్టి.. డివిజన్ మేనేజర్ గుప్తా..

**గుంతకల్ రైల్వే ఏప్రిల్ 04 ప్రభాతవార్త**



విండో ట్రైలింగ్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించిన డిఆర్ఎం గుప్తా.

గుంతకల్ రైల్వే డివిజన్‌లో గుంతకల్ డివిజనల్ రైల్వే మేనేజర్ చంద్ర శేఖర్ గుప్త మరియు సంబంధిత శాఖాధికారుల తో కలిసి అనంతపురం నుండి పీలేరు వరకు విండో ట్రైలింగ్ ఇన్స్పెక్షన్ నిర్వహించారు. ట్రాక్ ఫిట్‌నెస్‌ను అంచనా వేయడం, ముఖ్యమైన భద్రతా మౌలిక సదుపాయాలను సమీక్షించడం, మరియు మరింత మెరుగుదల అవసరమైన ప్రాంతాలను గుర్తించడం. ఈ పరిశీలన సమయంలో, ట్రాక్ జియోమెట్రీ, సున్నితమైన ప్రాంతాల పరిస్థితి, మరియు మొత్తం నిర్వహణ ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టబడిందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## లేపాక్షి పంచాయతీ ప్రత్యేక అధికారిగా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ

**లేపాక్షి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త**



బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్

లేపాక్షి గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారిగా డిప్యూటీ ఎంపిడిఓ ఎస్.శ్రీనివాస్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చారిత్రక నేపథ్యం ఉన్న లేపాక్షి పంచాయతీ అభివృద్ధికి తన వంతు పూర్తిస్థాయిలో కృషి చేస్తానని పేర్కొన్నారు. గ్రామస్తులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తన లక్ష్యమన్నారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. పంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధుల సమన్వయంతో గ్రామ ప్రగతికి పాటుపడతానని స్పష్టం చేశారు. పంచాయతీ సమస్యల పరిష్కారంలో తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

## తెదేపా నాయకులు. పంచాయతీ కార్మికులకు ట్రై సైకిళ్లు పంపిణీ

**రొద్దం. ఏప్రిల్ 4 ప్రభాతవార్త.**

మండల కేంద్రమైన రొద్దం ఎంపీడీవో కార్యాలయంలో స్వచ్ఛ్ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ రెడ్డి వారి మంజునాథ్ ఆధ్వర్యంలో స్వచ్ఛందర కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్మికులకు ఎంపిడివో తెదేపా నాయకులు ట్రై సైకిల్ పంపిణీ చేశారు ఈ సందర్భంగా పంచాయతీ కార్మికుల ఉద్దేశించి మండల ఫైవ్ మాన్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామాల్లో పరిస్థితిని మెరుగుపరచడం కోసం చెత్త సేకరణను సులభతరం చేయడమే లక్ష్యంగా ఈ ట్రై సైకిల్ అందజేస్తున్నామని 16 పంచాయతీలలో పుష్కార్టులు 16 ట్రై సైకిల్ 21 డస్ట్ బిన్లు 126 ఆయా పంచాయతీ సెక్రటరీల ఆధ్వర్యంలో కార్మికులకు అందజేయడం జరిగింది పంచాయతీ కార్మికులు తమ పనిని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ పనిముట్లు దోహదపడతాయని నాయకులు తెలియజేశారు ఎంపీడీవో ఆనంద్ కుమార్ రెడ్డి గోవిందప్ప ఆయా పంచాయతీ కార్యదర్శులు తెదేపా నాయకులు నరహరి మాధవ నాయుడు చిన్నప్పయ్య వెంకటరామిరెడ్డి టైలర్ ఆంజనేయులు చంద్రమోళి సర్పంచులు మంజునాథ్ నాగరాజు మంజు జనార్ధన్ మహబూబ్ బాషా సిద్దన్న ఉమాశంకర్ మురళి ఆదిశేషు అక్బర్ కే చంద్రశేఖర్ రుద్ర ప్రసాద్ నాగ సురేష్ తదితరులు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



పంచాయతీ వర్కర్లకు ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న అధికారులు

## పెన్నహోబిళంలో వైభవంగా లక్ష్మినరసింహస్వామి పల్లకీ ఉత్సవం

**-పల్లకీ మోసిన దేవాదాయశాఖ జిల్లా ఏసీ, డీసీ కార్యాలయ ఏవో**

**ఉరవకొండ, ఏప్రిల్ 4 ప్రభాతవార్త**



లక్ష్మినరసింహస్వామి పల్లకీ ఉత్సవం దృశ్యం

ఉరవకొండ మండలం ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళంలో కొలువైన లక్ష్మినరసింహస్వామి పల్లకీ ఉత్సవం స్వస్తి శ్రీ పరాభవనామ సంవత్సరం చైత్ర శుద్ధ విదియ శనివారం సాయంత్రం వైభవంగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత నృసింహస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శోభాయమానంగా తీర్చిదిద్దిన పల్లకీలో కొలువుదీర్చగా దేవాదాయ ధర్మాదాయశాఖ జిల్లా సహాయ కమీషనర్ గంజి మల్లికార్జున ప్రసాద్, కర్నూల్ డిప్యూటీ కమీషనర్ కార్యాలయం పరిపాలన అధికారి సి.ఎన్.తిరుమలరెడ్డి పల్లకీ మోసి ప్రధానాలయం చుట్టూ ప్రదిక్షిణ నిర్వహించారు. చుట్టుప్రక్కల గ్రామాల నుండే కాకుండా జిల్లా నలుమూలలు, కర్నాటక ప్రాంతం నుండి కూడా భక్తులు, పర్యాటకులు పెద్దఎత్తున క్షేత్రానికి తరలివచ్చి శ్రీవారిని దర్శించుకొని ప్రత్యేక ఆకు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి సాకే రమేష్‌బాబు, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వనూ న్నరుస్వామి, దేవస్థానం అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన

**గుత్తి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త**



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఆ విపత్తులను అప్రమత్తతతో తప్పించుకోవాలని అగ్నిమాపకదళ అసిస్టెంట్ డివిజనల్ ఫైర్ అధికారి అశ్వర్థ సూచించారు. స్థానిక పి.ఆర్.ఎంబిఏ కళాశాలలో శనివారం విద్యార్థులకు అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాక్ డ్రిల్ ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసన్నకుమార్, సీఈఓ శ్రీరాములు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## అదనపు జెఎఫ్‌సిఎం కోర్టు ఏర్పాటుకు పరిశీలన

**గుత్తి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త**



భవనాలను పరిశీలిస్తున్న దృశ్యం

గుత్తి పట్టణంలో నూతనంగా అదనపు జెఎఫ్‌సిఎం కోర్టు ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ అయిన నేపథ్యంలో శనివారం భవనాలను కోర్టు సిబ్బంది పరిశీలించారు. పాత రెవెన్యూ కార్యాలయంలో ఉన్న సర్వే నెంబర్ 530-1బి2ఏ1లో 100 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న భవనాన్ని అధికారులు పరిశీలించారు. గతంలో ఈ భవనంలో అదనపు జిల్లా కోర్టు నిర్వహించేవారు. ప్రస్తుతం విఆర్ఒలు వినియోగించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో నూతనంగా కోర్టు ఏర్పాటు నిమిత్తం ఈ భవనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి తహశీల్దార్ సూర్యనారాయణ, కోర్టు సూపరింటెండెంట్ శ్రీనివాసులు, కోర్టు క్లర్క్ సాదిక్, కోర్టు సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీచైతన్య యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

**- విద్యార్థిని చితకబాదిన పీఈటీపై కేసు నమోదు చేయాలి**

**- పీడీఎస్‌యూ నియోజకవర్గం కార్యదర్శి వినోద్**

**గుంతకల్లు, ఏప్రిల్ 4 ప్రభాతవార్త**



పాఠశాల ముందు ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీ చైతన్య యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు అఖిల్, వినోద్‌లు డిమాండ్ చేశారు. శనివారం పాఠశాల ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థి విశ్వేశ్వర్ చెప్పులు వేసుకొచ్చాడని పీఈటీ చితక బాదాడన్నారు. ఏమాత్రం మానవత్వం లేకుండా వ్యవహరించిన పీఈటీపై క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. ఈ విషయంపై విద్యార్థి తల్లిదండ్రులు మండల విద్యాధికారి ముందు విలపించినా పట్టించుకోలేదన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## మండల సర్వసభ్య సమావేశంకు పలుశాఖ అధికారులు డుమ్మా.

**డుమ్మా కొట్టిన అధికారులపై సభ్యులు ఆగ్రహం.**



మాట్లాడుతున్న ఆర్డబ్ల్యూఎస్ ఏఈ బాబా ఫక్రుద్దీన్.

**కనగానపల్లి ఏప్రిల్ 4 ప్రభాతవార్త**

మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హార్టికల్చర్, ఆర్టీసీ, ఫారెస్ట్, పీహెచ్సీ డాక్టర్, ఇరిగేషన్, ఏపీఎంఐపి లు వీరితో పాటు పలు శాఖ అధికారులు సర్వసభ్య సమావేశానికి డుమ్మా కొట్టడంపై ఎంపీటీసీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి డుమ్మా కొట్టిన అధికారులకు షోకాజ్ నోటీసులు పంపించి వారిపై చర్యలు తీసుకోవాలని సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మండలంలో జరిగిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్. అనిల్ కుమార్, తహసిల్దార్ జీ.వి. ప్రసాద్, ఎంపీడీవో కార్యాలయ ఏవో కే.టీ. శ్రీధర్ శర్మ, ఎంపీపీ భాగ్యమ్మ, ఎంఈఓ లు అరుణమ్మ, శ్రీదేవిలు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ బాబా ఫక్రుద్దీన్, ట్రాన్స్కో ఏఈ కొండారెడ్డి, అగ్రికల్చర్ ఏవో మాధురి, హౌసింగ్ ఏఈ మహేష్, ఏపీఎం హేమలత, ఎంపీటీసీలు పూజారి రత్నమ్మ చిన్న చెరువన్న, పలు శాఖ అధికారులు, పాల్గొన్నారు.

# శేషం పల్లిలో వనభోజనాలు

రామగిరి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త


శేషం పల్లిలో వనభోజనాలకు వెళ్తున్న గ్రామస్తులు

మండలంలోని శేషం పల్లి గ్రామంలో శనివారం వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి యేడాది శ్రీరామనవమి పండుగ తర్వాత వనభోజనాల పండుగను నిర్వహించుకుంటారు. గ్రామంలోని అందరూ ఇళ్లకు తాళాలు వేసి గ్రామ శివారులోకి వెళ్లి వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించుకుని తిరిగి సాయంత్రం 6 గంటలకు గ్రామానికి చేరుకుంటారు. అక్కడ వనభోజనాలకు వెళ్లి చెట్ల కింద సమైఖ్యంగా భోజనాలు చేసుకుని పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు. చెట్ల కింద ఉయ్యాలలు, గ్రామీణ క్రీడలను ఆనందోత్సవాల నడుమ జరుపుకున్నారు.

# ఎండలో తిరిగే సమయంలో జాగ్రత్తలు పాటించండి

**-వడదెబ్బపై అవగాహన ర్యాలీలో ఐసీడీఎస్ సీడీపీవో డా॥బి.ఎన్.శ్రీదేవి**

ఉరవకొండ, ఏప్రిల్ 4 ప్రభాతవార్త


అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఐసీడీఎస్ సీడీపీవో డా॥బి.ఎన్.శ్రీదేవి

వేసవి ఎండలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని బయట తిరిగే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని ఐసీడీఎస్ ఉరవకొండ సీడీపీవో డా॥బి.ఎన్.శ్రీదేవి అన్నారు. పట్టణంలోని 1,2వ సెక్టార్ల పరిధిలోని 13వ, పాతపేట అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో శనివారం వడదెబ్బపై ప్రజలకు అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో డా॥బి.ఎన్.శ్రీదేవి మాట్లాడుతూ ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటలవరకు అత్యవసరం అయితే తప్ప ఎండలో తిరగవద్దని, తిరగాల్సి వచ్చినప్పుడు ఎండ తగలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే వడదెబ్బ తగిన ఒక్కో సమయంలో ప్రాణాలు కోల్పోయే అవకాశాలు లేకపోలేదని వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజేశ్వరి, ఏఎన్ఎం సుమలత, అంగన్‌వాడీ కార్యకర్తలు శ్వేతనాగు, సంతోషి, షహనాజ్, సహాయకులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# లక్ష్మినరసింహస్వామి ఆలయంలో నిత్యన్నదానికి రూ.10వేల విరాళం

**-తన కుమార్తె పేరుతో అందించిన ఆలయ పూర్వ ఈవో సి.ఎన్.తిరుమలరెడ్డి**

ఉరవకొండ, ఏప్రిల్ 4 ప్రభాతవార్త


అన్నదాన కార్యక్రమానికి విరాళాన్ని ఆలయ ఈవో సాకే రమేష్‌బాబుకు అందిస్తున్న పూర్వ ఈవో సి.ఎన్.తిరుమలరెడ్డి

మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళం లక్ష్మినరసింహస్వామి ఆలయంలో నిత్యన్నదాన కార్యక్రమానికి ఆలయ పూర్వ ఈవో సి.ఎన్.తిరుమలరెడ్డి తన కుమార్తె దక్షితరెడ్డి పేరుతో 10వేల రూపాయల విరాళం అందించారని ఆలయ కార్యనిర్వహణ అధికారి సాకే రమేష్‌బాబు తెలిపారు. శనివారం ఆలయంలో ఆయన ధర్మకర్తల మండలి సభ్యుల సమక్షంలో నగదును అందించారన్నారు. సదరు మొత్తాన్ని అన్నదాత పథకం శాశ్విత చందా కింద బ్యాంకులో ఫిక్సెడ్ డిపాజిట్ చేయడం జరుగుతుందని సదరు మొత్తానికి వచ్చే వడ్డీను అన్నదానానికి ఖర్చు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు మీనుగ రామకృష్ణ, ఇంద్రావతి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# జగ్జీవన్‌రామ్ విగ్రహంపెట్టే స్థలంలోని జండా కట్టను తొలగించండి

**-సీఐ మహానంది, పంచాయతీ పరిపాలన అధికారి మహమ్మద్ రఫీకు ఎంఆర్‌పీఎస్ వినతి**



సీఐ మహానంది, పంచాయతీ పరిపాలన అధికారి మహమ్మద్ రఫీకు వినతిపత్రాలు అందిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

ఉరవకొండ, ఏప్రిల్ 4 ప్రభాతవార్త

ఉరవకొండ పట్టణంలోని బళ్లారి బైపాస్ కె.కె.ఫిల్లింగ్ స్టేషన్‌వద్ద స్వాతంత్ర సమరయోధుడు, దివంగత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహంపెట్టే స్థలంలో ఇటీవల ఒక వ్యక్తి జండా కట్టను నిర్మించాడని దాన్ని తొలగించాలని యుపీఎస్ సీఐ బి.మహానంది, మేజర్ గ్రామ పంచాయతీ పరిపాలన అధికారి షేక్ మహమ్మద్ రఫీకు ఎంఆర్‌పీఎస్ నాయకులు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ నాయకులు మాట్లాడుతూ బైపాస్ రోడ్డులో కూడలిలో ఇదివరకు ఉన్న బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని రోడ్డు వెడల్పు సమయంలో అడ్డువస్తుందని తొలగించి స్థానిక పంచాయతీ కార్యాలయంలో పెట్టడం జరిగిందన్నారు. రోడ్డు పనుల కాంట్రాక్టు సంస్థ ఎస్.ఆర్ కన్‌స్ట్రక్షన్స్ వద్దకు ఎస్సీ మాదిగలమైన తాము వెళితే రోడ్డు పనులు పూర్తి అయిన తరువాత తమ సొంత ఖర్చుతో కె.కె.ఫిల్లింగ్ స్టేషన్‌కు ఎదురుగా మధ్యలో విగ్రహం ఏర్పాటు చేస్తామని భరోసా ఇవ్వడం జరిగిందన్నారు. అయితే శుక్రవారం రోజు మోపిడి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి విగ్రహం ఏర్పాటు చేసే స్థలంలో జండా కట్ట కట్టడం జరిగిందన్నారు. సదరు జండా కట్టను తొలగించి న్యాయం చేయకపోతే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు ఎం.రాజు, కౌకుంట్ల రవి, ఎం.రామాంజినేయులు, జె.చెన్నప్ప తదితరులు ఉన్నారు.

# ఉరవకొండలో తాగునీటి సరఫరాకై ఐదు జోన్ల ఏర్పాటు

**- ఎంపీడీవో బి.వి.రవిప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ అంజుమన్ సఫ్రీన్**

ఉరవకొండ, ఏప్రిల్ 4 ప్రభాతవార్త

రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశాల మేరకు తాగునీటి సరఫరాలో సమస్యలు ఉత్పన్నం కాకుండా అమలు, పర్యవేక్షణకుగాను ఉరవకొండ పట్టణాన్ని 52 ప్రాంతాలు, ఐదు జోన్లుగా విభజించి సిబ్బంది ఏర్పాటు చేయడం జరిగిందని ఎంపీడీవో బి.వి.రవిప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ అంజుమన్ సఫ్రీన్ శనివారం తెలిపారు. గ్రామాల్లో ఆయా పంచాయతీ పరిపాలన అధికారుల పర్యవేక్షణలో సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి గ్రామంలోనూ సీపీడబ్ల్యూ స్కీంవల్ల గాని, త్రాగునీటి సమస్య రాకుండా చూడటానికి గ్రామీణ నీటి సరఫరా విభాగం ద్వారా పిర్యాదుల నమోదకై మొబైల్ నంబర్ 94911 20803ను ఏర్పాటు చేశామన్నారు. పట్టణ, మండల ప్రజలు తమ పిర్యాదులను సదరు మొబైల్ నంబర్‌కు కార్యాలయం పనివేళల్లో ఫోన్ చేసి తెలియజేస్తే వాటిని పరిష్కరించడం జరుగుతుందని వివరించారు.

# లక్ష్మినరసింహస్వామి ఆలయ ఈవోగా సాకే రమేష్‌బాబు బాధ్యతల స్వీకరణ

**-రెగ్యూలర్ ఈవోగా నియమిస్తూ దేవాదాయశాఖ కమీషనర్ ఉత్తర్వులు**

ఉరవకొండ, ఏప్రిల్ 4 ప్రభాతవార్త


ఆలయ కార్యనిర్వహణ అధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న సాకే రమేష్‌బాబు

ఉరవకొండ మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళం లక్ష్మినరసింహస్వామి ఆలయ కార్యనిర్వహణ అధికారిగా సాకే రమేష్‌బాబు శనివారం బాధ్యతలు చేపట్టారు. సాకే రమేష్‌బాబును ఆలయ రెగ్యూలర్ కార్యనిర్వహణ అధికారిగా నియమిస్తూ దేవాదాయ ధర్మాదాయశాఖ కమీషనర్ ఉత్తర్వులు జారీ చేయగా ఉదయం ఆయన ఆలయానికి చేరుకొని ఆలయ పూర్వ కార్యనిర్వహణ అధికారి సి.ఎన్.తిరుమలరెడ్డి నుంచి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ నూతన ఈవో సాకే రమేష్‌బాబు మాట్లాడుతూ ఆలయానికి సుదీర్ఘకాలం కార్యనిర్వహణ అధికారిగా పనిచేసిన అనుభవంతో ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ రేగటి నాగరాజు, సభ్యుల సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేయడానికి, ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

# సత్యనారాయణపేట, వడ్డే వీధిలో పిచ్చికుక్క స్వైర విహారం..!

**- పది మందికిపైగా తీవ్ర గాయాలు, ప్రభుత్వాసుపత్రిలో చికిత్స**

**- పంచాయతీ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదంటున్న ప్రజలు**

ఉరవకొండ, ఏప్రిల్ 4 ప్రభాతవార్త



పిచ్చికుక్క దాడిలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

ఉరవకొండ పట్టణంలోని సత్యనారాయణ, వడ్డే వీధిలో శనివారం పిచ్చికుక్క స్వైర విహారం చేసి 10 మందికిపైగా గాయపర్చింది. ఆయా కాలనీలకు చెందిన రెడ్డి క్రిష్ణ, వన్నూరుస్వామి, ప్రేమ్, ఫర్హాన, క్రిష్ణ, చిన్న, రాజులతోపాటు పదేళ్ల వయసుగల బాలురు సంజయ్, మణికంఠ కూడా పిచ్చికుక్క దాడిలో తీవ్రంగా గాయపడ్డారు. దీంతో వారి కుటుంబ సభ్యులు బాధితులను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఉదయాన్నే ముగ్గురు వ్యక్తులు పిచ్చికుక్క బారినపడి గాయపడగా స్థానికులు సమాచారాన్ని మేజర్ గ్రామ పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే సదరు పిచ్చికుక్కను బంధించే చర్యలు జరుగకపోవడంతో మధ్యాన్న 2 గంటల ప్రాంతంలో సదరు పిచ్చికుక్క మరికొందరిపై దాడిచేసి గాయపర్చింది. పిచ్చికుక్క స్వైర విహారంతో ఆయా కాలనీల ప్రజలు ఇళ్లల్లోంచి బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. పట్టణంలో వీధి కుక్కలు, కోతుల బెడద అధికంగా ఉందని మనుషులపై అవి దాడులు చేస్తున్నాయని వాటని నియంత్రించాలని చాలా కాలంగా ఇటు ప్రజాప్రతినిధులు, అటు పట్టణ ప్రజలు అధికారులకు వినతిపత్రాలు ఇవ్వడంతోపాటు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా అధికారుల్లో స్పందన లేకపోవడం విశేషంగా చెప్పాలి.

# కూటమి కుట్రలను సోషల్ మీడియా ద్వారా ప్రజలలోకి తీసుకెళ్దాం...!

ధర్మవరం,మార్చి4,ప్రభాతవార్త


సమావేశంలో పాల్గొన్న వైసీపీ సోషల్ మీడియా సభ్యులు

ధర్మవరం పట్టణంలోని 1,38 వార్డుల సోషల్ మీడియా విభాగం సంబందించిన కమిటీ సభ్యులతో ఇంచార్జ్ ల సమక్షంలో సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ సందర్భంగా సోషల్ మీడియా కమిటీ సభ్యులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎటువంటి హామీలు ప్రజలకు నెరవేర్చలేదని, రైతులకు, యువత,విద్య,ఆరోగ్యం అన్ని వర్గాలకు కూటమి ప్రభుత్వం మోసం చేసిందని,అదే విధంగా జగనన్న అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి పనులు కూడా కూటమి ప్రభుత్వం తమకు అనుకూలంగా మలుచుకొని మేము చేసాము అని చెప్పుకుంటున్నారన్నారు. ఇలాగే ప్రతి విషయం లోను అభివృద్ధి ఏమి చేయలేక పోగా కేవలం వై యస్ జగన్ మోహన్ రెడ్డి పైన మాత్రమే లేనిపోని బురదజల్లుతూన్నారన్నారు.అధికార పార్టీ చేస్తున్న అన్యాయలు, దౌర్జన్యాలు ప్రతి ఒక్కటి ప్రజలకు సోషల్ మీడియా వేదికగా చేరాలని ఈ సమావేశం లో సోషల్ మీడియా కమిటీ సభ్యులకు తెలియజేయడం జరిగిందన్నారు.త్వరలో పట్టణం 40 వార్డుల సోషల్ మీడియా సభ్యులతో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి అధ్యక్షన మీటింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డ్ ఇంచార్జ్ లు చెలిమి పెద్దన్న,చంద్ బాషా ,సోషల్ మీడియా టౌన్ ప్రెసిడెంట్ జక్కా భార్గవ, బుగ్గ ప్రవీణ్, రాజశేఖర్ రెడ్డి,చెన్న రెడ్డి ,హరినాథ్, శ్రీ హరి, సిద్దిక్, దాదు తదితరులు పాల్గొన్నారు.

# జెడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాలలో ఘనంగా కల్చరల్, స్పోర్ట్స్ వీక్

**-వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించిన మెడల్స్ ప్రదానం**

ఉరవకొండ, ఏప్రిల్ 4 ప్రభాతవార్త


విజేతలకు మెడల్స్ అందిస్తున్న ఎంఈవో-2 రమాదేవి

పట్టణంలోని జిల్లా పరిషత్ సెంట్రల్ ఉన్నత పాఠశాలలో కల్చరల్, స్పోర్ట్స్ వీక్ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. డీఈవో ఆదేశాల మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మండల విద్యాధికారి-2 రమాదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కల్చరల్ ప్రోగ్రాముల్లో శాస్త్రీయ, జానపద నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి ముఖ్య అతిథి చేతుల మీదుగా మెడల్స్‌ను బహుమతిగా అందించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి-2 రమాదేవి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు చందా మారుతిప్రసాద్, పుల్లా రాఘవేంద్ర, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# బైండ్ ఓవర్ నిబంధనలను అతిక్రమిస్తే తప్పదు జరిమానా, ఎస్సై సుధాకర్ యాదవ్

సోమందేపల్లి మార్చి 4 ప్రభాతవార్త


తాసిల్దార్ ముందు వ్యక్తులను బైండ్ ఓవర్ చేసిన ఎస్ఐ సుధాకర్ యాదవ్

మండలంలో గతంలో కొంతమంది వ్యక్తులపై బైండోవర్ చేసిన ఆ వ్యక్తులు బైండోవర్ నిబంధనలను అతిక్రమించి, మళ్లీ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినందున, వారి పై చట్టపరమైన చర్యలతో పాటు జరిమానాన్ని విధించడం జరిగిందని తెలియజేశారు అందులో భాగంగా ఫోర్ఫీచర్ ప్రక్రియ ప్రారంభించడమైనది. ఈ మేరకు సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసి, ఒక వారం రోజుల గడువు ఇచ్చి, చట్టపరమైన చర్యల నుండి తప్పించుకునేందుకు అవకాశం కల్పించడమైనది. ఎమ్మార్వో మారుతి సమక్షంలో విచారణ జరిపి, సంబంధిత వ్యక్తులకు క్రింది విధంగా అవకాశాలు ఇవ్వడమైనది బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించినందుకు సంబంధిత అమోంట్ చెల్లించడం లేదా రూ.1,00,000/ బాండ్ అమోంట్ చెల్లించడం లేదా ఒక నెల జైలు శిక్షను అనుభవించడంఈ సందర్భంగా ముగ్గురు వ్యక్తులు తమ తప్పును అంగీకరించి, విధించిన అమోంట్‌ను చెల్లించడమైనది. అలాగే మండలంలో జరుగుతున్న సివిల్ వివాదాలు, ముఖ్యంగా భూ తగాదాల నేపథ్యంలో, శాంతి భద్రతల పరిరక్షణ కొరకు 5 మంది వ్యక్తులపై బైండోవర్ కేసులు నమోదు చేయడమైనది.ఈ సందర్భంగా సోమందేపల్లి పోలీస్ వారు ప్రజలకు హెచ్చరికగా తెలియజేయునది ఏమనగా, ఒకసారి బైండోవర్ అయిన తర్వాత కూడా అసాంఘిక కార్యకలాపాలు, గొడవలు కొనసాగించినచో, ప్రతి వ్యక్తిపై సంవత్సరానికి రూ.5,00,000/ వరకు ఫోర్ఫీచర్ చేయబడటమే కాకుండా, జైలు శిక్ష కూడా విధించబడుతుంది. అని సూచించారు అందుకోసం ప్రజలు చట్టాలను గౌరవించి, శాంతియుతంగా జీవిస్తూ, నేరాలు , అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని తెలియజేశారు.

# అర్హులైన ప్రతి రైతుకు పాస్ పుస్తకం అందజేస్తాం-తాసిల్దార్ మారుతి



సమావేశంలో తాసిల్దారును సన్మానిస్తున్న పందిపర్తి శ్రీనివాస్ రెడ్డి

సోమందేపల్లి మార్చి 4 ప్రభాతవార్త

రాష్ట్రప్రభుత్వం ఆదేశాలమేరకు రాష్ట్రమంత్రి, పెనుకొండ నియోజకవర్గం ఎమ్మెల్యే సవితమ్మ సూచనల మేరకు శనివారం మండలంలోని పందిపర్తి గ్రామంలోనిర్వహించిన భూమి పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేపట్టారు ఈ కార్యక్రమానికి ముఖ్యులుగా తాసిల్దార్ మారుతి, రాష్ట్రవాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ దీజు ఆంజనేయులుకి బొకేలు పూలమాలతో సత్కరించి ఆహ్వానించారు అర్హులైన ప్రతి రైతుకు ప్రభుత్వం నుండి పాస్ పుస్తకాలు అందజేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు ఈ కార్యక్రమంలో చల్లపల్లి రామకృష్ణ,పందిపర్తి శ్రీనివాస్ రెడ్డి, పందిపర్తి మాజీ ఎంపీటీసీ మూర్తి, టీడీపీ నాయకులు, వ్యవసాయ అధికారులు ,సర్వేయర్లు పాల్గొన్నారు.

# ఉన్నం కుటుంబాన్ని పరామర్శించిన ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్...!

ధర్మవరం,ఏప్రిల్4,ప్రభాతవార్త


చౌదరి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పరిటాల శ్రీరామ్

తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్నం హనుమంతరాయ చౌదరి కుటుంబాన్ని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ పరామర్శించారు. ఇటీవల హనుమంతరాయ చౌదరి మరణించిన నేపథ్యంలో కళ్యాణదుర్గం మండలం ఎర్రంపల్లి గ్రామానికి శ్రీరామ్ వెళ్లారు. ఉన్నం సతీమణి, కుమారుడు మారుతి చౌదరిని కలిసి పెద్దాయన మరణానికి సంతాపాన్ని వ్యక్తం చేశారు.తాను ఎప్పుడు కనిపించినా ఎంతో ప్రేమగా పలకరించే వారని గుర్తు చేసుకున్నారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని శ్రీరామ్ అన్నారు

# ద్విచక్ర వాహణాల తనిఖీ

పరిగి ఏప్రిల్ 4(ప్రభాత వార్త:


తనిఖీ నిర్వహిస్తున్న దృశ్యం

సత్యసాయి జిల్లా పరిగి మండల కేంద్రంలోని ప్రధానరహదారి పై జిల్లా ఎస్ పి సతీష్ కుమార్ ఆదేశాల మేరకు పరిగి ఎస్ ఐ రంగడు యాదవ్ పోలీస్ స్టేషన్ సిబ్బంది ద్విచక్ర వాహనాలను తనిఖీ నిర్వహించారు తనిఖీలో భాగంగా వాహన దారుల హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్, మైనర్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్,తదితరాలపైన తనిఖీ నిర్వహించి జరిమానాలు విధించారు కార్యక్రమంలో పరిగి పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# పంచాయతీలకు ప్రత్యేక అధికారులు నియామకం

డి.హిరేహాళ్ ఏప్రిల్ 4 ప్రభాతవార్త

సర్పంచుల పదవీకాలం ముగియడంతో 16 పంచాయతీలకు ప్రత్యేక అధికారుల నియామకం జరిగినట్లు శనివారం ఎంపీడీవో దాస్ నాయక్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. డి.హిరేహాళ్ మండల పరిధిలోని జాజరకల్లు పంచాయతీ ప్రత్యేక అధికారిగా తహసిల్దార్ సాకే శ్రీనివాసులు, మడేనహళ్లి, డి. హిరేహాళ్, గొడిసెలపల్లి పంచాయతీలకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి దాస్ నాయక్ నియామకమయ్యారు. ఎంఈఓ సరోవర్ బాషా కు చెర్లోపల్లి పంచాయతీ, పాలనాధికారి బలరామరావు కు కాదలూరు, దొడగట్ట, సోమలాపురం పంచాయతీలు అప్పగించినట్లు ఎంపీడీవో చెప్పారు. జై.హనుమేష్ కు మలపనగుడి, హులికల్లు, ఎం. హనుమాపురం, డిప్యూటీ ఎంపీడీవో యోగానంద కు మల్లికేతి, ఓబులాపురం, పులకుర్తి పంచాయతీలు, ఏవో కృష్ణకిషోర్ రెడ్డి కి మురడి, నాగలాపురం పంచాయతీల్లో నియమించినట్లు ఎంపీడీవో చెప్పారు.

# సర్పంచులకు ఘనంగా సన్మానం.

కనగానపల్లి ఏప్రిల్ 4 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండలంలో ఐదు సంవత్సరాలు పదవీకాలం పూర్తి కావడంతో అధికారులు సర్పంచులకు వీడ్కోలు పలికేందుకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచులకు, అధికారులు పూలమాలలు అందించి శాలువా కప్పి వారిని ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అనిల్ కుమార్, తహసిల్దార్ జి. వి. ప్రసాద్, టిడిపి మండల కన్వీనర్ యాతం పోతులయ్య, తాజా మాజీ సర్పంచ్ లు పూజారి రేవతి రాజాకృష్ణ, మాధవ రాజు, ఈడిగ రామాంజనేయులు, దాసిరెడ్డి, బాలరాజు,రేణుక పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్లు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గిట్టుబాటు ధర లేక మొక్కల్లోనే టమోటా

**- భారీగా టమోటా దిగుబడి.. ధర లేక వెలవెల**

అగళి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త


దిగుబడి భాగా వచ్చిన పంటలను మొక్కల్లోనే వదిలేసిన దృశ్యం

రైతు ఆరు కాలం కష్టపడి పంటలను సాగు చేస్తే తీరా గిట్టుబాటు ధర లేక రైతులు డీలా పడుతున్నారు. అగళి మండలంలో టమోటా సాగుతోపాటు గుమ్మడి సాగును రైతులు భాగా చేశారు. దిగుబడి బాగా వచ్చింది కానీ ధర మాత్రం గిట్టుబాటు కాకపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం జరుగుతుండటం వల్ల, ముఖ్యంగా హోటల్స్ వారు కూరగాయలను అమ్మక పోవడంతో ధరలు పడిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని రామనపల్లికి చెందిన సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు ఇంజినీర్ ఎస్‌వి.చలపతి 5 ఎకరాల్లో టమోటా సాగును, 2 ఎకరాల్లో గుమ్మడి సాగును చేశారు. టమోటా పంట సాగు చేయడానికి, దుక్కి దున్నడానికి మందులు, ఎరువులు, కూలీలకు దాదాపు 3 లక్షలు ఖర్చు కాగా గుమ్మడి సాగుకు ఎరువులు, మందులు, దుక్కి దున్నడానికి 2 లక్షల వరకు ఖర్చు అయిందని, సదరు రైతు తెలిపారు. దాదాపు 5 లక్షలు ఖర్చు కాగా తనకు రూపాయి కూడా ఆదాయం రాలేదని వచ్చిన పంటను కోయడానికి, కోస్తే కూలీలకు డబ్బులు ఖర్చు, రవాణా చార్జీ కూడా చేతుల నుంచి పడుతుంది కావున ఆ టమోటా పంటను, గుమ్మడిపంటను పొలంలోనే వదిలేసినట్లు రైతు తెలిపారు. టమోటా, గుమ్మడి సాగు వల్ల తీవ్రంగా నష్టపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# “కమ్మ”ని....రాసలీల నాయుడు కొండ దిగు

**- టీటీడీ ఛైర్మన్ బిఆర్ నాయుడు రాజీనామా చేయాలని వైసీపీ శ్రేణులు డిమాండ్**

**- గోరంట్లలోని కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలోని వెంకటేశ్వరస్వామిని మొక్కుకున్న వైనం**

**- వైసీపీ మండల కన్వీనర్ పగడాల వెంకటేష్, టౌన్ కన్వీనర్ మేదర శంకర ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు**


ఆలయం ముందు నిరసన తెలుపుతున్న వైసీపీ శ్రేణులు

గోరంట్ల, ఏప్రిల్ 4 ప్రభాతవార్త

ఏడుకొండలవాడా ఓ దేవదేవ పవిత్రమైన ఏడుకొండలపై రాసలీల నిర్వహించే ఓ కళంకితుడు పాపాలు చేస్తున్నాడు పనిష్మెంట్ ఇవ్వు అంటూ గోరంట్ల మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం వైసీపీ మండల కన్వీనర్ పగడాల వెంకటేష్, పట్టణ కన్వీనర్ మేధర శంకర ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. మాజీ మంత్రి శ్రీసత్యసాయి జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ ఆదేశాలు మేరకు టీటీడీ ఛైర్మన్ బిఆర్ నాయుడు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోరంట్ల మెయిన్ రోడ్డులోని శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసే ఘటనల నేపథ్యంలో బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కళంకిత బిఆర్ నాయుడు బూతు బాగోతం వెలుగులోకి వచ్చినా ముఖ్యమంత్రి చంద్రబాబు ఎందుకు స్పందించడం లేదని గోరంట్ల మండల వైసిపి శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కోట్లాది మంది భక్తుల మనోభావాలను గౌరవిస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు రాణాప్రతాప్‌సింగ్, యువజన విభాగం మండల అధ్యక్షులు సంపత్‌కుమార్, మాజీ వార్డు మెంబర్ సుబహాన్, చలపతినాయక్, సుకుమార్‌గుప్త, కురుబ సత్యనారాయణ, లక్ష్మినారాయణయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# గుత్తిలో ఘనంగా జీసస్ ఫర్ రన్

గుత్తి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త


ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

మానవాళి రక్షణ కోసం, కరుణ ప్రేమ భావాలతో సేవతో మెలగాలని కరుణామయుడు ఏసుప్రభువు చెప్పిన ప్రభోదాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ జీవించాలని వక్తలు పేర్కొన్నారు. ఏసుక్రీస్తు పునరుద్దాన సువార్త యాత్ర పురస్కరించుకొని గుత్తి మున్సిపాలిటీలో శనివారం జీసస్ ఫర్ రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గుత్తి ఆర్ఎస్‌లోని సిఎస్ఐ చర్చి నుండి ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా గాంధీ చౌక్, రాజు సర్కిల్ నుండి పట్టణంలోని సిఎస్ఐ చర్చి వరకు భారీగా ర్యాలీ నిర్వహించారు. దాదాపు 5 కిలోమీటర్ల మేర ఈ ప్రదర్శన కొనసాగింది. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు గావించి గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ సాల్మన్ బాబు, డేవిడ్ నాయక్, విజయకుమార్ చార్లెస్‌తో పాటుగా సిఎస్ఐ డయాలసిస్ రాయలసీమ ట్రెజరర్ రసెల్ కిరణ్, మింగి కిరణ్, ఫిలిప్ సుధాకర్, మాథ్యూ గాబ్రియేల్, శేఖర్, సునీల్, సుదర్శన్, కన్నయ్య, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఎస్ఐగా రమేష్ బాబు

**మండలంలోని సవాళ్లను అధిగమించేనా**

గుడిబండ, ఏప్రిల్ 4 ప్రభాతవార్త


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ రమేష్ బాబు

గుడిబండ పోలీస్‌స్టేషన్‌కు నూతన సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా రమేష్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. కర్నాటక రాష్ట్రానికి సరిహద్దులో ఉన్న గుడిబండ మండలంలో గత కొంతకాలంగా మట్కా, జూదం, కర్నాటకమద్యం అక్రమ రవాణా వంటి కార్యకలాపాలు జరుగుతున్నాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. సరిహద్దు ప్రాంతం కావడంతో ఇటువంటిఅక్రమాలు నియంత్రించడం పోలీసులకు సవాల్‌గామారింది. ఈ నేపథ్యంలో కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ రమేష్ బాబు ఈసమస్యలను ఎలా ఎదుర్కొంటారన్నది చర్చనీయాంశంగా మారింది. ఈ సందర్భంగా ఎస్ఐ రమేష్ బాబు మాట్లాడుతూ మండలంలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ఎట్టిపరిస్థితుల్లోనూ తావు ఉండదని,మట్కా,జూదం,అక్రమ మద్యం రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టి కఠిన చర్యలు తీసుకుంటామని ,ప్రజలు కూడా ఇలాంటి అక్రమాలపై సమాచారం అందించాలని తెలిపారు.నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన రమేష్ బాబు మండలంలోని సమస్యలను ఎంతవరకు అధిగమించి అక్రమ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తారో వేచిచూడాలి.

